క్లుప్తంగా

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్

చిత్తూరు కార్పొరేషన్: రైల్వేస్టేషన్‌లో శనివారం ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించమని జీఆర్‌పీ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా కట్టడిలో భాగంగా ప్రయాణికుల బ్యాగులను పోలీసు శునకాల చేత తనిఖీలు చేయించామన్నారు. స్టేషన్ పరిశీలన ప్రాంతాల్లో క్షుణ్ణంగా చూశామన్నారు. రైళ్లలో కూడా పరిశీలన చేశామని వివరించారు.

15న కళాకారుల సమ్మేళనం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కళాకారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): కళావికాసంలో భాగంగా కళాకారుల సమ్మేళన కార్యక్రమాన్ని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎం.వి.కేశవరెడ్డి స్మారక్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ నెల 15న చిత్తూరులో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎం.వి.శ్రీధర్‌రెడ్డి, సి.నారాయణస్వామి తెలిపారు. చిత్తూరు నగరంలోని సమాఖ్య కార్యాలయంలో కకళాకారుల సమేళన కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యంత వైభవోపేతంగా జరగనున్న ఈ జాతీయస్థాయి ద్విశతాధిక కళాకారుల మహోత్సవం వండర్‌బుక్స్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కానుందని వారు వెల్లడించారు. దీనికి అందరూ ఆహ్వానితులేనన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.మునీంద్ర, పి.రోహిత్, కె.ఆనందనాయుడు, కేశరు సింగ్, కోటీశ్వర మొదలియార్, జి.భూపతి, రాజేంద్రన్, నాగరాజు, రంగనాథన్, ప్రకాష్ పాల్గొన్నారు.

13న శ్రీముత్యాలమ్మ జాతర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని తేనెబండలో ఈ నెల 13న ముత్యాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో వెంకట్రాయులు తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు అభిషేకం జరుగుతుందన్నారు. సాయంత్రం 6గంటలకు సింహ వాహనంపై అమ్మవారిని ఆశీనులు చేసి కొండచుట్టూ తిరునాళ్ల, రాత్రి 9 గంటలకు పుష్పపల్లకిపై అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందని చెప్పారు. భక్తులు పాల్గొని అమ్మవారి జాతరను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం

యాదమరి: మండల కేంద్రంలోని ఇంద్ర వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి నిర్వహించిన పుష్పపల్లకి ఉత్సవంతో పరిపూర్ణమయ్యారయి. అర్ధరాత్రి దేవదేవుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వామివారి పుష్పపల్లకి ఉత్సవం కనుల పండువలా సాగింది. ముందుగా స్వామి అమ్మవారి మూలవార్లకు సుగంధ భరితమైన పరిమళ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాది పూజలు గావించారు.

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం



విరాళం అందిస్తున్న చంద్రన్ కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు శనివారం పలువురు దాతలు విరాళం అందించారు. చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లికి చెందిన చంద్రన్ కుటుంబ సభ్యులు రూ.లక్ష, విజయవాడకు చెందిన మల్లికార్జున కుటుంబ సభ్యులు రూ.ఒక లక్ష విరాళం అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు దాతల కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విరాళం అందజేస్తున్న మల్లికార్జున

పంట రుణంపై కూటమి విషం

చిత్తూరు మండలానికి చెందిన కనక అనే వ్యక్తి పలమనేరు రోడ్డులోని ఓ బ్యాంకులో రూ.47వేలు పంట రుణం తీసుకున్నాడు. ఏటా రెన్యూవల్ చేయిస్తున్నాడు. యథావిధిగా ఈ సారి కూడా బ్యాంకర్లు రెన్యూవల్ చేయించుకోవాలని ఫోన్ చేశారు. బ్యాంకు వద్దకు వెళ్లిన ఆ వ్యక్తిని బ్యాంకర్లు వన్‌బీ తీసుకురమ్మని చెప్పారు. మీ–సేవకు వెళ్లిన ఆ వ్యక్తికి ఆన్‌లైన్ నిర్వాహకుడు వన్‌బీ రావడంలేదు. డిజిటల్ సమస్య ఉందని షాక్ ఇచ్చాడు. తీరా తహసీల్దార్ కార్యాలయానికి వెళితే పంట సాగు చేసిన భూమి ఫ్రీహోల్డ్‌లో ఉందని, వన్‌బీ రాదని చెప్పేశారు. జేసీకి ఫిర్యాదు చేయాలని చెప్పుకొచ్చారు. దీంతో రెన్యూవల్ ఎలా చేసుకోవాలో తెలియక ఆ పేద రైతు దిగాలు చెందుతున్నాడు.



బ్యాంకులో గత ఏడాది రుణం తీసుకుని సాగు చేసిన వేరుశనగ పంట (ఫైల్)

- ఫ్రీ హోల్డ్ పేరిట అడ్డంకులు
- ఆన్‌లైన్‌లో అందని వన్‌బీ ఫారం
- క్రాప్‌లోన్ రెన్యూవల్‌కు వన్‌బీ తప్పనిసరి
- రుణం చెల్లించలేక రైతుల అవస్థలు

కాణిపాకం: కూటమి ప్రభుత్వం పేద రైతులను పీడిస్తోంది. ఫ్రీహోల్డ్ పేరిట పేదల భూములపై విషం కక్కింది. తద్వారా ఆన్‌లైన్‌లో వన్‌బీలు చిక్కని పరిస్థితి దాపురించింది. క్రాప్‌లోన్ (పంట రుణం)రెన్యూవల్‌కు బ్రేకులు పడింది. వన్‌బీ లేకుండా బ్యాంకర్లు రెన్యూవల్ చేయాలేమని తెగేసి చెబుతున్నారు. సవాలక్ష ఆంక్షలు పెడుతున్నారు. రుణదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేద రైతులు మండిపాటుకు గురవుతున్నారు.

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గంలో సుమారు 60వేల హెక్టార్ల డీకేటీ భూములున్నాయి. ఇందులో 35వేల హెక్టార్ల భూమికి పట్టా పాసు పుస్తకాలున్నాయి. ఈ భూములను నమ్ముకుని పేద రైతులు బతుకు జీవనం సాగిస్తున్నారు. పంట సాగు అవసరాల నిమిత్తం చాలా మంది రైతులు బ్యాంకులో పట్టా పాసుపుస్తకాలను తాకట్టు పెట్టి బ్యాంకు రుణాలు తీసుకుంటుంటారు. అయితే కొందరు ఈ రుణాలను ఏడాదిలోనే చెల్లించేస్తుంటారు. మరికొందరు మాత్రం ఏటా రెన్యూవల్ చేయించుకుంటారు.

రెన్యూవల్ కష్టం ఇది

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డీకేటీ భూములు కలిగిన వారికి సర్వహక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంది. భూ అనుభవ కాలాన్ని అర్హతగా ఎంపిక చేసి ఈ ప్రక్రియ అమలుకు శ్రీకారం చుట్టింది. అయితే కూటమి ప్రభుత్వం పేద రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. ఆ ప్రక్రియను నిలుపుదల చేయించింది. దీంతో ఆ భూములన్నీ కూడా ఫ్రీహోల్డ్‌లో ఉన్నాయి. ఈ కారణంగా మీసేవ, సచివాలయాల్లో ఆ భూములకు సంబంధించిన సర్వే నంబర్ల ఆధారంగా వన్‌బీకి దరఖాస్తు చేసుకుంటే రావడం లేదు. ఈ వన్‌బీ రాకపోవడంతో పలు పథకాలు చేజారుతున్నాయి. పంట రుణాలు తీసుకున్న పేద రైతులు ఇబ్బందిపడుతున్నారు. వన్‌బీ లేని కారణంగా బ్యాంకర్లు రెన్యూవల్ చేయనంటున్నారు. కచ్చితంగా వన్‌బీ కావాలని నిబంధన పెడుతున్నారు. లేకుంటే మొత్తం నగదు చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో రైతులు ఏం చేయాలో తెలియక తికమకపడిపోతున్నారు. వడ్డీ కట్టించి రెన్యూవల్ చేయించుకోమని రైతులు ప్రాధేయపడినా వారు మాత్రం అంగీకరించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేద రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రెన్యూవల్ చేసుకోవాలని ఆదేశాలిచ్చాం



ఈ సమస్య మా దృష్టికి వచ్చింది. ఫ్రీ హోల్డ్ సమస్య ఉన్నవాళ్లు పంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయ, రెవెన్యూ అధికారుల ద్వారా లేఖ తీసుకెళ్లాలి. ఈ విషయంపై బ్యాంకర్లతో కూడా చర్చించాం. రెన్యూవల్ చేసుకోవాలని ఆదేశాలిచ్చాం. బ్యాంకర్లు స్పందించని పక్షంలో తమ దృష్టికి తీసుకురావచ్చు.

–హరీష్, ఎల్‌డీఎం, చిత్తూరు

ఎర బుట్టల సరఫరా



మామిడి కొమ్మకు కట్టిన పండుఈగ నివారణ బుట్ట

తవణంపల్లె: మామిడి పంటను ఆశిస్తున్న పండు ఈగ నివారణకు రైతులు ఎర బుట్టలు వాడి పంటను కాపాడుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి సాగరిక తెలిపారు. వర్షాలు ముందుగా రావడంతో మామిడి పంటను పండు ఈగ అధికంగా ఆశిస్తుందని పేర్కొన్నారు. దీని నివారణ కోసం ఉద్యాన శాఖ ద్వారా మామిడి రైతులకు రాయితీతో ఎర బుట్టలు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఒక్కొక్క బుట్ట సబ్సిడీతో రైతులకు రూ.11కు సరఫరా చేస్తామన్నారు. ఎకరాకు 8 బుట్టలు వాడాలని, 2–5 హెక్టార్లకు 20 బుట్టలు వినియోగించవచ్చని సూచించారు. ప్రతి రైతుకు 40 బుట్టల వరకు ఇస్తామన్నారు. బంగారుపాళ్యం రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మామిడి రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకొచ్చి డబ్బులు చెల్లించి బుట్టలు తీసుకోవచ్చని వివరించారు.

పూతలపట్టు ఈద్గాలో ప్రసంగిస్తున్న మత పెద్ద



ప్రత్యేక ప్రార్థనలో చిన్నారులు



ప్రార్థనకు హాజరైన ముస్లింలు



త్యాగానికి ప్రతీక బక్రీద్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో శనివారం బక్రీద్ పర్వదినాన్ని వేడుకగా నిర్వహించనున్నారు. జరుపుకున్నారు. ఉదయం నుంచే మసీదుల్లో ప్రత్యేక పార్థనలు ప్రారంభమయ్యాయి. ఆనందోత్సాహాలతో మసీదులు, ఈద్గాల వద్దకు చేరకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీంతో అల్లా నామస్మరణలతో మారుమోగాయి. మత పెద్దలు భక్తి శ్రద్ధలతో ప్రవచనాలు చేశారు. ముస్లింల రాకతో మసీదులు, ఈద్గా కళకళలాడాయి.

ఈద్గాలో....

బక్రీద్‌ను పురస్కరించుకుని ముస్లింలు మత పెద్దలతో కలిసి ఈద్గాకు ర్యాలీగా చేరుకున్నారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు ప్రార్థనలు చేశారు. బక్రీద్‌ను ఉద్దేశించి మతపెద్ద ప్రసంగిస్తూ బక్రీద్ తాగ్యానికి ప్రతీక అన్నారు. అనంతరం ముస్లింలు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు సైతం ఉత్సాహంగా కరచాలనాలు, ఆలింగనాలు చేసుకుని సందడిగా కనిపించారు. మిట్టూరు, రామ్‌నగర్‌కాలనీ, సుబేధార్‌వీధి, గంగనపల్లి, తేనెబండ, బజారువీధి, హైరోడ్డు, తుమ్మింద, బీఎస్‌ఆర్‌పేట, తదితర ప్రాంతాల్లోని మసీదుల్లో ముస్లింలు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో తరలివచ్చి నమాజు చేశారు. అనంతరం ఖుర్బానీ పంపిణీ చేపట్టారు. బక్రీద్ రోజున ముస్లింలు మేకపోతు, పొట్టేలు మాంసాన్ని ఖుర్బానీ ఇవ్వడం ఆచారం. దీన్ని మూడు భాగాలుగా చేసి ఇళ్లకు తీసుకెళ్లడంతో పాటు బంధువులకు, పేదవారికి పంచిపెట్టారు. మధ్యాహ్నం మతాలకు అతీతంగా సహపంక్తి భోజనం చేసి మత సామరస్యాన్ని చాటారు.

పోలీసుల నిఘా

బక్రీద్ పండుగ సందర్భంగా చిత్తూరు నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మసీదులు, ఈద్గా వద్ద కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతాల్లో ప్రశాంతంగా ప్రార్థనలు జరిగేలా ముందస్తు చర్యలు తీసుకున్నారు. గిరింపేట మార్గంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చిత్తూరు– వేలూరు మార్గాల్లో తిరిగే వాహనాలను బైపాస్ మీదుగా మళ్లించారు.

ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రత్యేక ప్రార్థనలు

బంగారుపాళెం: బక్రీద్ పండుగ పర్వదినాన్ని శనివారం మండలంలోని ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు ముస్లింలు బంగారుపాళెం జామియా మసీదు వద్దకు చేరుకున్నారు. అనంతరం ప్రదర్శనగా మొగిలి వెంకటగిరి గ్రామం సమీపంలో గల ప్రత్యేక ప్రార్థనా స్థలం (ఈద్గా)కు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. హజరత్ బక్రీద్ పండుగ విశిష్టతపై సందేశమిచ్చారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలను తెలియజేసుకున్నారు. పేదలకు దేవుని పేరుమీద ఖుర్బానీ ఇచ్చారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

యాదమరి: మండల వ్యాప్తంగా బక్రీద్ పండుగను ముస్లింలు వేడుకగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మసీదుల్లో మతగురువు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు బక్రీద్ సందేశాన్ని ఇచ్చారు. మహమ్మద్ ప్రవక్త త్యాగానికి గుర్తుగా జరుపుకునే బక్రీద్ పర్వదినం త్యాగం, జాలి, దయ కలిగి ఉండాలనే సందేశాన్ని ఇస్తుందని చెప్పారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదులు, ప్రత్యేక ప్రార్థనా మందిరాలు పండుగ వాతావరణంతో కలకళలాడాయి.

పూతలపట్టులో..

పూతలపట్టు(కాణిపాకం): మండల కేంద్రంలోని ఈద్గాలో శనివారం బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు ఈద్గాలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మత పెద్ద బక్రీద్ పర్వదిన ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సేవ కార్యక్రమాలు చేపట్టారు.

ముందే మోగిన బడిగంట

- తెరుచుకున్న ప్రైవేట్ పాఠశాలలు
- ప్రవేశాల కోసం ఆదుర్దా

గుడిపాల: స్వేచ్ఛాయుత వాతావరణంలో పిల్లల ఆలోచనలు, ఆశయాలకు కష్టం లేకుండా విద్య నేర్పాలన్న లక్ష్యంతో తెచ్చిన బాలల విద్యాహక్కు చట్టం నీరు గారుతోంది. వేసవి సెలవులు పూర్తికాక ముందే ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకున్నాయి. ప్రవేశాల కోసం యాజమాన్యాలు వెంపర్లాడుతున్నాయి. ఒంటిపూట బడులు అంటూ పిల్లల్ని మధ్యాహ్నం వేళ వరకూ ఉంచి, సాయంత్రం వేళల్లో ఉపాధ్యాయ సిబ్బందిని ఊళ్ల మీదకి ప్రచారం కోసం గడపగడపకు పంపుతున్నారు. అంతా తెలిసిన విద్యాశాఖాధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు.

తెరుచుకున్న పాఠశాలలు

రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 13న పాఠశాలలు తెరవాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. అయితే నియోజకవర్గంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ఈ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. చిత్తూరు నియోజకవర్గంలో ఇప్పటికే పలు ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకున్నాయి. ప్రవేశాల కోసం వెంపర్లాడుతూ దుకాణాల్లా తలుపులు తెరిచి కూర్చున్నారు. పుస్తకాలు, యూనిఫాం ముందస్తు అమ్మకాల కోసం పోటీ పడుతున్నారు.

ఎవరు తెలివి వారిది

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 13వ తేదీ వరకు విద్యార్థులను సివిల్ దుస్తుల్లో పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించాయి. యూనిఫాం ఉంటే ఫలానా స్కూల్ అని తెలుస్తుందన్న ఆలోచన వారిది. తాటిచెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ గడ్డికోసం అన్న తీరుగా.. స్కూల్ ఎందుకు తెరిచారంటే ఫలానా వాళ్లు ఓపెన్ చేశారు కాబట్టే మేము ఓపెన్ చేశామని చెబుతున్నారు. ఇక తల్లిదండ్రుల ఆత్రం చెప్పక్కర్లేదు. స్కూల్ ఎప్పుడు తెరుస్తారా.. పిల్లలను పంపించేద్దామా అని ఎదురుచూస్తుంటారు.

వేతనం మూరెడు చాకిరీ బారెడు

ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ సిబ్బంది ఇబ్బందులు వర్ణనాతీతం. పిల్లల్ని కసరకూడదు.. తిట్టకూడదు.. కొట్టకూడదు కానీ రిజల్ట్ మాత్రం రావాలి. సెలవులు అడక్కూడదు. రికార్డ్ వర్క్ అంతా సర్కార్ టీచర్లు మాదిరిగానే చేయాలి. ఉద్యోగం ఉండాలంటే ప్రవేశాలు తీసుకురావాలి. ఇష్టం ఉన్నా లేకున్నా యాజమాన్యం చెప్పినట్టు గడప గడపకీ ప్రచారానికి పోవాలి. వేతనం మూరెడు–చాకిరీ బారెడు అన్న రీతిలో ఉంది ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల పరిస్థితి.

చిత్తూరు బస్టాండులో రెండు డిపోల గొడవ



తిరుపతి పాయింట్ వద్ద గొడవకు దిగిన కార్మికులు



ఢీకొన్న రెండు బస్సులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండులో శనివారం వన్ డిపో– టూడిపో బస్సులు ఢీకొన్నాయి. రెండు డిపోలు తిరుపతి ప్లాట్‌ఫామ్‌లో ఒకటో పాయింట్ కోసం పోటీపడ్డాయి. నువ్వా–నేనా అంటూ తలపడ్డాయి. చివరికి ఢీకొట్టుకున్నాయి. దీంతో వన్‌డిపో బస్సు వెనక వైపు దెబ్బతింది. వివరాల్లోకి వెళితే.. గత 8 నెలలుగా చిత్తూరు వన్ డిపో–టూ డిపోకు మధ్య పోరు నడుస్తోంది. తిరుపతికి తామే తిప్పాలని వన్ డిపో కార్మికులు పట్టుపడుతున్నారు. టూ డిపో అధికారి గంగాధరనెల్లూరు రూట్‌లో తిరుగుతున్న బస్సులను తిరుపతికి మళ్లించారని వారు రాత పూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ బస్సులు తిరగాల్సిన రూట్‌లో టూడిపో బస్సులు తిరగడం ఏమిటని ప్రశ్నిస్తూ వచ్చారు. అయితే ఈ తంతూ ఇటీవలే కాస్త సద్దుమణిగింది. మళ్లీ శుక్రవారం నుంచి ఈ రెండు డిపోల మధ్య వివాదం తలెత్తింది. బస్టాండులోని తిరుపతి ప్లాట్‌ఫామ్‌లో ఒకటో పాయింట్‌కోసం పట్టుపడుతున్నారు. శనివారం ఉదయం 7 గంటలకు తిరుపతి ప్లాట్‌ఫామ్‌లోని ఆ పాయింట్‌లో బస్సు పెట్టేందుకు రెండు డిపో బస్సులు పోటీపడ్డాయి. ఈ క్రమంలో గొడవ ప్రారంభమైంది. రెండు డిపోలకు సంబంధించిన యూనియన్ నాయకులు అక్కడకు చేరుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అరుపులు, కేకలతో దద్దరిల్లింది. ఈ క్రమంలో రెండు బస్సులు రాసుకుంటూ ఢీకొట్టుకున్నాయి. దీంతో వన్‌డిపో బస్సు వెనుక భాగంలో దెబ్బతింది. ఇదంతా డిపో–2కు సంబంధించిన ఓ అధికారే కారణమని, ఇంత జరుగుతున్న డిపో అధికారులు చోద్యం చూడడంపై యూనియన్ వర్గాలు మండిపడుతున్నాయి. ఈ సమస్యపై అధికారులే పట్టించుకోన్నప్పుడు మనమెందుకు గొడవ పడాలని వాళ్లకు వాళ్లే సర్దుకున్నారు. ఈ విషయం మీడియా వరకు వెళ్లడంతో అక్కడి నుంచి కార్మికులు మాయమయ్యారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్‌లో ప్రైవేటు విద్యార్థుల ప్రతిభ

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని పలు కళాశాలల్లో విద్యనభ్యసించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఈ మేరకు శనివారం ఇంటర్మీడియట్ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో పలువురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఆ విద్యార్థులను ఆయా కళాశాలల నిర్వాహకులు అభినందించారు. నగరంలోని మురుగానపల్లి పీఎస్ఎస్ శ్రీ వివేకానంద కళాశాలలో జూనియర్ ఎంపీసీ చదువుతున్న ప్రజ్వల 470 మార్కులకు 468, నక్షత్ర 468, జుహితా రాజ్, లక్ష్మీ ప్రసన్న, నలని 466, రవళిక, జ్యోతిష్, జీవిత, ప్రవీణ్, గణేష్, మోక్షిత్‌రెడ్డి, పద్మేష్, జాహ్నవి 465, బైపీసీలో 440 మార్కులకు పౌర్ణమి, శ్రీనిధి, రూప 425, వరుణ్ సందేష్ 412, హస్మిత 403 మార్కులు సాధించారు. ఆ విద్యార్థులను కరస్పాండెంట్ పి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ నాగరాజశెట్టి అభినందించారు.

శ్రీ వివేకానంద కళాశాల విద్యార్థులు | విద్యావికాస్ విద్యార్థులు | విజయం విద్యార్థులు | అరుణాచల విద్యార్థిని



ప్రజ్వల, నక్షత్ర, తేజ, సాహితి, లావణ్య, వైష్ణవి, ప్రణీత, పవన్‌కుమార్, తనూజ

ఇదే కళాశాలలో చదువుతున్న విద్యార్థులు సీవోఎండీకే (కన్సార్టియమ్ ఆఫ్ మెడికల్, ఇంజనీరింగ్ అండ్ డెంటల్ కాలేజెస్ ఆఫ్ కర్ణాటక) పరీక్షల ఫలితాల్లో తేజా 99.499 పర్సంటైల్‌తో ఆల్ ఇండియా 585, సాహితి 97.316 పర్సంటైల్ తో 3059వ ర్యాంకులను సాధించారు. కొంగారెడ్డిపల్లిలోని విద్యావికాస్‌లో బైపీసీ చదువుతున్న నిఖిత 440 మార్కులకు 435, జ్యోత్స్న 435, వైష్ణవి 435, ఎంపీసీలో లావణ్య 464 మార్కులు సాధించారని కరస్పాండెంట్ ప్రకాష్‌చంద్రారెడ్డి వెల్లడించారు.

విజయం కళాశాలలో..

మిట్టూరులోని విజయం కళాశాలలో జూనియర్ ఎంపీసీ చదువుతున్న ప్రణీత, పవన్‌కుమార్, రాజశ్రీ 466, వేణి, ధనవి, విష్ణుప్రియ, నాగవర్షిత 465 మార్కులు సాధించారని కరస్పాండెంట్ తేజోమూర్తి తెలిపారు. మిట్టూరు అరుణాచల కళాశాలలో ఎంపీసీ చదువుతున్న తనూజ 452, భవ్య 449, హేమచంద్రారెడ్డి 405, సాదియ 404, బైపీసీ చదువుతున్న రేవంత్ 413 మార్కులు సాధించారని కరస్పాండెంట్ జగన్నాథరెడ్డి తెలిపారు.